# మీనాక్షి పరిణామం

మం. ఉమాదేవి

సాయంకాలం అయిదు గంట లయింది. ఆ రోజు మీనాక్షిగారింట్లో బహు సందడిగా వుంది. మధ్య హాలులో పెద్ద పెద్ద తివాసీలు పరచి వున్నాయి. పైన ఫాను గిరగిరా తిరుగుతూ అందరకూ గాలిని సరఫరా చేస్తూంది. హాలులో మూలగా వున్న టేబిల్ మీద రేడియో నుండి శ్రావ్యంగా వీణా వాయిద్యం వీనుల విందు చేస్తూంది. తివాసీలమీద ముత్తయిదువలు కూర్చున్నారు. మిలమిల మెరుస్తున్న కనకాంబరం రంగు పట్టు చీరతో, కుంకుమ రంగు వెల్వెట్ చోళీ వేసుకుని, మెడలో తెల్ల రాళ్ల నెక్లెస్‌తోబాటు తదితర ఆభరణాలతో అలంకరించుకుని, సాక్షాత్తూ లక్ష్మీ దేవిలా వెలిగిపోతున్న మీనాక్షి ద్వారం దగ్గర నిల్చుని వస్తున్న పేరంటాళ్ల నాహ్వానించి తివాసీపై కూర్చోబెడుతూంది. అక్కడే వచ్చీ రాని నడకతో ఆటలాడుకుంటున్న లీల మీనాక్షికి అపురూపంగా పుట్టిన బిడ్డ. ఆ రోజుననే ఒక సంవత్సరం నిండి రెండవ సంవత్సరం ప్రవేశించింది. మీనాక్షి కూతురు లీల పుట్టిన రోజు పండగే ఈ రోజు సందడి కంతటకూ కారణం.

మీనాక్షి భర్త కరుణాకరం ఆ వూరి కంతా పేరు మోసిన డాక్టరు. బాగా రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. మనిషి కూడా స్ఫురద్రూపి. పేరుకు తగ్గట్లు కరుణా హృదయుడే కరుణాకరం. కాస్త బీదసాదల్ని ఒక కంట కనిపెడతాడు. నిక్కచ్చిగా బిల్లు ఇంటికి పంపించే బాపతు కాదు. అందుచేత వూళ్లో చాలమంది మందులకు ఇతని దగ్గరకే వస్తారు. గత సంవత్సరం పాతిక వేలు పెట్టి పెద్ద మేడ కొన్నాడు. మరో పాతిక వేలకు పైగా రొక్కం బ్యాంకులో వేశాడు. మీనాక్షి కూడా అందంలో భర్తకు తీసిపోదు. కాని, గుణంలో వ్యతిరేకం వుంది. తన సమాన హోదాలో వున్న వారితో తప్ప తదితరులతో కలిసి మెలిసి వుండే స్వభావం కాదు. ధనం గల వారిని గౌరవించినట్లు, పేదవారిని ఆదరించ లేదు. మీనాక్షి భర్తని ఒక్కొక్కప్పుడు, అందరితో చనువుగా వుండవద్దనీ, పిలవగానే వెళ్ల వద్దనీ కూడా హెచ్చరిస్తూంది. ఎంతసేపూ హోదాలోనే వుండాలి గాని, ఒక్క మెట్టు దిగినా తన గౌరవానికి భంగమని భయపడే రకం. దానికి తోడు తల్లిదండ్రులకు గారాలపట్టి, కావలసినంత ఆస్తి వుండటంచేత చిన్నప్పటినుండీ తల్లిదండ్రులు ఆమె అన్న మాట జరిపించేవారు. పెండ్లయి అత్తవారింటికి వచ్చినా ఆమెకు ఆ విషయంలో ఏ విధమైన లోటూ కరుణాకరం చేయలేదు. కరుణాకరం తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి అతనిని ఎంతో శ్రమపడి పెద్ద జేశాడు. చదువు చెప్పించి పెండ్లి చేశాడు. కోడలు కాపురానికి వచ్చిన కొద్ది రోజులకే కన్ను మూశాడు. మీనాక్షి భర్త కూడా ఆర్జనపరుడే కావటంచేత, డబ్బును గురించి పడవలసిన కష్టాలుగాని, బాధలుగాని ఆమెకు తెలియవు. తెలియవలసిన అవసరమూ లేదు. కాని ఇంకొక దిగులుండేది. ఆమె కాపురానికి వచ్చిన అయిదారు సంవత్సరాల వరకూ సంతానం కలుగలేదు. అప్పటికే అమ్మలక్కల ద్వారా గొడ్డుమోతుదని వూరూ వాడా ప్రాకిపోతున్న సమయంలో భగవంతుని దయవల్ల ఒక్క ఆడ నలుసు కలిగింది. ఇంక మీనాక్షికి ఆ కొరత కూడా తీరింది.

## 2

రంగు రంగుల చీరలతో, రకరకాల ఫేషన్లతో, గాజుల గలగలలతో, గులాబీ మల్లెల వాసనలతో హాలంతా గుమ్ముమంటూంది. ఈ చీర ఎంతయింది శశీ? అని ఒకరు ప్రశ్నిస్తే ఆ నెక్లెసు డిజైను చాలా బాగుందంటున్నారు ఇంకొకరు. ఈ సంక్రాంతికి మావారు నాకో రవ్వల నెక్లెసు ఆర్డరిచ్చారని ఒక పూబోణి పలుకగా, ఈ ముత్యాల గాజులు నిన్ననే వచ్చాయని ఇంకొక అలివేణి తన గొప్పదనం చాటింది. ఇలాగ ఒకరి మాట ఒకరు వినకుండా ఎవరికి తోచింది వారు మాట్లాడుకుంటున్న మాటలు, నవ్వులు హాలును ప్రతిధ్వనింప జేస్తూండగా, మీనాక్షి లీల నెత్తుకుని అక్కడకు ప్రవేశించింది. బిడ్డను కుర్చీలో కూర్చోబెట్టి, హారతి పళ్లెం తెచ్చింది. కర్పూరం వెలిగించాక ఎవరయినా ఒక పాట మంగళ హారతి పాడండీ అని ముత్తయిదువల నుద్దేశించి పలికింది. ఎవరికి వారే మాకు పాటలు రావండీ అన్నారు. ఇంకా కొందరు నీవు పాడవమ్మా అంటే మీరు పాడండీ అని హెచ్చరించుకున్నారు. నాకు హారతి పాటలే రావని ఒకరు, శ్రుతి లేనిదే పాటేమిటండీ? అని ఇంకొకరు, వీణ లేనిదే అసలు పాడలేనని వేరొకరు అంటున్నారే గాని మొత్తంమీద ఏ ముత్తయిదువా పాట పాడలేదు. అప్పుడు మూలగా కూర్చున్న ఒక ముసలి పునిస్త్రీ ముందుకు జరిగి మా కాలంలో ఇలాగ కాదమ్మా! ఎంచక్కా పాడమనంగానే, మంగళ హారతులు, వియ్యపురాలి పాటలు, నలుగు పాటలు, ఆధ్యాత్మిక రామాయణం విడవకుండా గంటలకొద్దీ పాడే వాళ్లం. అదేమిటో ఈ కాలం పిల్లల్ని పాడమంటే, వీణ లేదూ, ఫిడేలు లేదూ అని గునుస్తారు. లేదా పాడేరంటే అదుగో ఆ హిందీ పాటలు కంఠమంతా నొక్కుకు మరీ పాడతారు. అదేమంటే, అదేదో సినిమాలో మంగేసుట ఇల్లాగే పాడిందంటారు. కాలం మారిపోయింది అంటూ ఏకబిగిని ఎవరూ వూపిరి పీల్చుకుందుకయినా వీలు లేనంత త్వరగా లెక్చరు దంచేసి, "నలుగూ పెట్టెద రారా" అన్న పాట మందర స్థాయిలో అందుకుంది. ఈ కోలాహలం ఇట్లుండగా మీనాక్షి బిడ్డకు హారతిచ్చి పని మనిషికి లీల నప్పజెప్పి, పేరంటాళ్లకు, బొట్టు, పసుపు, గంధం వగైరా లివ్వటానికి దిగింది.

అంతలో ఒక పేరంటాలు వచ్చింది. ఆమెకు వయస్సు సుమారు పాతికకు మించి వుండదు. మనిషి అందంగానే వున్నా చూడటానికి పేదరాలని తెలుస్తూంది. ముదురాకు పచ్చ చీర కట్టుకుని, కొద్దిగా మాసిన గులాబి రంగు జాకెట్టు వేసుకుంది. మెళ్లో పసుపు తాడు, నల్ల పూసల కుత్తిగంటు, ఇవీ ఆభరణాలు. చేతులకు మట్టి గాజు లున్నాయి. ముఖాన్న కుంకుమ బొట్టు పెద్దదుంది. ఆమె సిగ్గు పడుతూ లోనికి వచ్చి తివాసీ అంచున కూర్చుంది. మీనాక్షి ఈమెను చూసినా చూడనట్లే వూరుకుంది. తక్కిన వారందరకూ, తాంబూలం, పండ్లు, మిఠాయి, పంచదార చిలుకలు చిన్న పిల్లలకు పంచి పెట్టడంలో మునిగిపోయింది. ఈ విధంగా ఒక అరగంట గడిచిపోయింది. చాలా భాగం అందరూ ఇండ్ల కెళ్లారు. అప్పుడు ఈ పేద ముత్తయిదువ మీనాక్షితో ఏమండీ, మీ పాపను చూచి పోదామని వచ్చాను. ఒకసారి చూపిస్తారా? అని అడిగింది.

మీనాక్షి సమాధానం చెప్పకుండానే చిరాగ్గా లేచి ఆమెకు బొట్టు పెట్టడానికి కుంకుమ భరిణె తీసింది. పాపం ఆమె ఇంకేం అడగలేదు. ఇంతలో ఆ ఇంటి గేటు దగ్గర కారాగింది. చప్పుడు విని

మీనాక్షి అటు చూచింది. అందులోనుండి ఒక లావుపాటి ఇల్లాలు కష్టపడి దిగుతూండగా, మీనాక్షి వరాసరి కారువద్దకే వెళ్లి, రండి రండి మీరు రాలేదేమా? అనే అనుకుంటున్నా. ఆమె చెయ్యి పట్టుకు తీసుకువచ్చి హాలులోని తివాసీపై కూర్చోబెట్టింది. ఆ ముత్తయిదువకు వంటి బరువుకు తోడు నగల బరువు ఎక్కువయిపోవటంచేత తివాసీపై చతికిలబడింది. ఏదో కొంతసేపు కబుర్లయ్యాక ఆమె మీనాక్షితో ఇలాగంది. ఏమమ్మా మీనాక్షి! పుట్టిన రోజు పెండ్లికూతురేదీ? దిష్టి తగులుతుందని దాచేశావా? వెంటనే మీనాక్షి నాలుక కరచుకుంటూ — ఎంత మాట? మీకు చూపించటాని కేం? నా దగ్గ రుంటే మారాం చేస్తుందని పని మనిషి గంగి నాడించమన్నాను. పిలుస్తానుండండని గంగీ, గంగీ! అమ్మాయి నిటు తీసుకురా! అని ఉరిమింది.


గట్టిగా పిలిచింది. కాని జవాబు రాలేదు. తిరిగి దగ్గరగా కేకేసింది. ఈసారీ సమాధానం రాలేదు. మీనాక్షి ముఖం కోపంతో ఎర్రబడగా లేచి నిలుచుంది. చూశారా? ఈ పనివాళ్ల పొగరూ? ఇక్కడే వుండమంటే ఎక్కడకో తీసుకుపోయింది. క్షణంలో తీసుకువస్తా కూర్చోండి అని లోపలి కెళ్లింది.

లోపలి కెళ్లిన మీనాక్షికి ఇల్లంతా వెదకినా పని మనిషిగానీ, లీలగానీ కనిపించలేదు. గదులన్నీ వెదికాక దొడ్లో కెళ్లింది. అక్కడ బావి ప్రక్క బాదం చెట్టు నీడలో కూర్చుని గంగి అంట్లు తోముతూ కనిపించింది. లీల అక్కడ లేదు. మీనాక్షికి కోపం హెచ్చిపోయింది. ఏమే మొద్దూ! అమ్మాయేదీ? ఎక్కడ దిగవిడచి వచ్చావ్?

తలవంచుకుని అంట్లు తోముతున్న గంగి అదిరిపడి తలెత్తి చూసింది. అదేమిటమ్మగారూ! తమరికాడే అమ్మాయిగార్ని విడిచానే? నన్ను కేకలేస్తారేంటే? అని తెల్లముఖం వేసింది. బలే చాలా బాగుంది. దాన్నెత్తుకోమని చేతికి బిడ్డనిస్తే నన్నే ఎదిరిస్తావటే. ఎక్కడ విడిచావో చూడు అని పెద్దగా అరచింది మీనాక్షి.

గంగి తోముతున్న మసిగిన్నెలు అలాగే విడిచిపెట్టి, చేతులు కడుక్కుని ఇంట్లోకి పరుగెత్తింది. మీనాక్షి వెంబడించింది.

పేరంటాళ్లు కూర్చున్న హాలులోనే విడిచిపెట్టానంటూ గంగి చెప్పింది. ఎక్కడ విడిచిపెట్టావని మీనాక్షి కేకవేసింది. మొత్తం మీద ఇల్లంతా వెదకినా లీల కనుపించలేదు. ఎవరింటికయినా వెళ్లిందేమో నంటే నడక బాగా రాదు. ఎంత గాలించినా బిడ్డ



దొరకలేదు. పైగా వంటినిండా నగలున్నాయి. మెల్లో పులిగోరు పతకం, గొలుసూ, మొలకు బంగారు బిళ్ల మామిడి పిందెలూ, చేతులకు నాలుగు జతల గాజా లున్నాయి. సొమ్ములమాటకేం అసలు బిడ్డే కనిపించదాయె. మీనాక్షి భయంతో వణకి పోయింది. గంగిని చుట్టుపట్ల ఇళ్లలో వెదకమని తరిమింది. వెళ్లగా మిగిలిన పేరంటాళ్లలో కలకలం ప్రారంభించింది.


ఇదుగో కాంతం వదినా, మా పినతల్లి మేనత్త మనుమరాలిని ఎవరో నగలకోసమని పిల్లనెత్తుకు పోయారు. ఒంటి నున్న నగలన్నీ తీసుకుని బిడ్డను బావిలో పారేశారు జ్ఞాపకముందా? ఒక పునిస్త్రీ ఇంకొకామెకు జ్ఞాపకంచేయగా ఫలానా వా రబ్బాయి వంటి వస్తువులన్నీ దోచుకుని ఊరవతల మామిడి తోపులో, కాళ్లూ, చేతులూ కలియగట్టి పడేశారు ఈ మధ్యనే అని ఇంకొక వార్త ఇంకొకరు చెప్పారు. ఇలాగ అప్పటి కప్పుడే చిత్ర విచిత్ర కథలల్లుకు పోయాయి. ఇవన్నీ వింటున్న మీనాక్షి నిలువునా వణికిపోయింది. ఎంత వెదికినా ఎక్కడా బిడ్డ కనిపించలేదు. ఏమయినట్లు? ఎవరు తీసుకెళ్లారు? కొంపదీసి నగలకోసం ఎవరన్నా ఏమీ చేయలేదు గదా! ఈ ఆలోచన వచ్చేసరికి మీనాక్షికి భోరున ఏడుపు వచ్చేసింది. ఇంతలో గంగి ఎవరింట్లో పిల్ల లేదనీ, ఎవరికీ తెలియదన్నారని చెపుతూ లోనికి రాగా మీనాక్షి కండ్లు తుడుచుకుంటూ అయ్యగారి దగ్గరకు పరిగెత్తిపోవే. ఎవరినయినా వెదకటాని పంపించుతారు. పో! గట్టిగా అరుస్తూ గంగిని ఆస్పత్రికి తరిమింది.

గంగి వెనకా ముందూ చూడకుండా ఆస్పత్రికి పరుగెత్తింది. మిగిలిన ముత్తయిదువలు ఒక్కొక్కరే నెమ్మదిగా జారుకున్నారు. లావాటామె కూడా కారెక్కి వెళ్లింది. బిడ్డ దొరుకుతుంది పరవాలేదన్న ముక్కగూడా ఎవరూ అనలేదు. ధైర్యం చెప్పటం మాటటుంచి ఎవరిమీద కేమొస్తుందో మాట అని ఇండ్లకు మెల్లగా వెళ్లిపోయారు. పేద ముత్తయిదువ, కొందరు పిల్లలూ మిగిలారు అంతే. మీనాక్షి మోకాళ్ళలో తల బెట్టుకుని దిగులుగా తివాసీమీద ముడుచుకు కూర్చుంది.

అన్ని గదులూ వెదికారా అక్కా? మీరు దిగులు పడకండి. ఏమూలనయినా ఆడుకుంటూ కూర్చుందేమో? మీనాక్షి భుజంమీద చెయ్యివేసి ఎంతో ఆప్యాయంగా పలకరించిం దా పేదరాలు. మీనాక్షి తలెత్తి ఆమెను చూసింది. మరీ చిరాకు ఎక్కువయిపోయింది. భుజంమీద చెయి త్రోసేస్తూ, అంతా వెదికాము కనిపించలేదని విసుక్కుంది. ఈసారి ఆమె మీనాక్షి కెదురుగావచ్చి ఆమె కండ్లుతుడుస్తూ మేడమీదకూడా వెదికారా? ఊరికినే ఖంగారుపడితే లాభం? లేవండి చూద్దాం అని నవ్వుతూ చాలా నెమ్మదిగా అనగానే మీనాక్షికి ఎంత ఆపుకున్నా దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ, ఏమో అనబోయి తలెత్తి ఆమెముఖం చూచింది. ప్రశాంతమైన కండ్లూ, నుదుట నున్న బొట్టూ ఆకర్షించాయి. ఒక్కసారి ఇలాగ ఆలోచించింది. ఈమెను నేను గౌరవించలేదు. రావటం చూచినా కూర్చో మనయినా చెప్పలేదు. పైగా లీలను ఒక్కసారి చూచిపోతానంటే చిరాకుపడ్డాను. అయినా ఎంత స్నేహభావంతో, అభిమానంతో తనకు ధైర్య వచనాలు చెప్తోంది. పిల్ల దొరుకుతుందని ఆశ కలుగజేస్తోంది. అంత గౌరవించినవాళ్లు చివరకు వెళ్తూ అమ్మాయికేం ఫర్వాలేదండీ అన్న మాటయినా అనలేదు. ఇంకా చెప్పకుండానే వెళ్లారు. ఈమె వేషాన్నిబట్టి బీదదని అసహ్యించుకున్నానే గాని మంచి మనస్సుని తెలుసుకోలేక పోయానుకదా! మీనాక్షి మనస్సు పశ్చాత్తాప పడింది. ఈమె నోటి చలువచేత నా బిడ్డ నిరపాయంగా దొరుకుతుందన్న ఆశకూడా కలిగింది. మేడమీద వెదుకుదాము రండి తిరిగీ ఆమె అడుగగానే కాదనలేక నెమ్మదిగా లేచి మేడ మెట్లు ఎక్కసాగింది. ఆమె వెనుకనే ఈమె కూడా వెళ్ళింది.

మేడమీద రెండే రెండు గదులున్నాయి. ఒక గదిలో మందుల బీరువాలు, ఇనపెట్టె తదితర వస్తువులు ఉండటంచేత ఎప్పుడు తాళం వేసే ఉంటుంది. అవసరమైనప్పుడు తెరచి వెంటనే తాళం వేసేస్తారాగదికి. రెండవది పడక గది. అందులో పందిరి మంచం, దానిమీద పరుపూ, దోమతెర తప్ప ఇంకేసామానూ లేదు. తాళంపెట్టిన గది దాటాక ఈ పడక గదిలోకి రావాలి. పైనున్న వరండా దాటాక ఇదుగోనండీ మీ పాప అంటూ ఆమె పడక గదిలోకి పరుగెత్తింది. ఆమె వెంటనే మీనాక్షి కూడా ఆత్రుతగా వచ్చింది. గదిలో పందిరి మంచం మూలగా క్రిందకు లీల మరొక నాలుగు సంవత్సరముల లోపు అమ్మాయీ రెండు పంచదార చిలుకలూ, ఒక చిన్న రబ్బరు బొమ్మ పెట్టుకుని ఆడుకుంటున్నారు. తల్లిని చూడగానే లీల తప్పటడుగులు వేసుకుంటూ వచ్చి రెండు కాళ్లనూ పెనవేసుకుంది. ప్రక్క నాడుకుంటున్న పాప భయంతో దూరంగా వెళ్లి తలుపు వార ఒదిగి నిల్చుంది. మీనాక్షి పిరిని చూచి నిర్ఘాంతపోయింది.

మీనాక్షి సంతోషంతో కొంత వరకూ మాట్లాడలేక పోయింది. తరువాత లీల నెత్తుకుని ముద్దు పెట్టుకుంది. వంటినున్న నగలన్నీ చూచింది. చెక్కు చెదరలేదు. నగలన్నీ ఉన్నాయి. తలుపు వారనున్న అమ్మాయిని భయంలేదని దగ్గరగా పిలిచి మీరు మేడమీద కెలాగవచ్చారు పాపా? భయంలేదు చెప్పు. మిఠాయి పెడ్తాను అని లాలించి అడిగింది. ఎంతో ముద్దుగా ఆ పాప వచ్చీ రాని మాటలతో మేల మేమే ఎక్కాం. అమ్మ అలుకోమని ఇచ్చిందివి. అంటూ బొమ్మ, చిలుకలూ చూపించింది.




TRADE MARK

ధూత పాపేశ్వర్ వారి

మకరధ్వజ గుటిక

బలహీనతకు సాటిలేని టానిక్

తయారు చేసినవారు :

ధూత పాపేశ్వర్

ఇండస్ట్రీస్ లిమిటెడ్

ఇండియాలో ప్రముఖ ఆయుర్వేద ఫార్మసి

(స్థాపితము : 1872 ఏ. డి.)

పన్వేల్ - బొంబాయి.

—: బ్రాంచి :—

సుల్తాన్ బజార్, హైదరాబాద్

(దక్కన్)

—: డిస్ట్రిబ్యూటర్లు :—

పద్మా ఏజన్సీస్

మెయిన్‌రోడ్, గుంటూరు.

జైన్ మెడికల్ స్టోర్స్

మెయిన్‌రోడ్, ఆదోని.